# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :22 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 09-03-2024 | పేజీలు:4 వెల: 2.00


## తెలంగాణ భవన్‌లో మహిళాదినోత్సవం.. పాల్గొన్న కవిత

హైదరాబాద్,తెలంగాణ భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునితా లక్ష్మారెడ్డి, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు.అనంతరం ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ..తెలంగాణ ఆడబిడ్డలందరికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.మహిళల అభ్యున్నతికి కేసీఆర్ కృషి చేశారని తెలిపారు. సమ్మక్క, సారలమ్మ, రుద్రమదేవిలా మహిళలు పోరాటం చేయాలన్నారు. అంతకుముందు..'ఆడదంటే అబల కాదు సబల అని నిరూపించి మహిళా హక్కుల పోరాటాలకు స్ఫూర్తినింపిన మహిళా దినోత్సవం నేడు. ఆ స్ఫూర్తిని ఎత్తిపడుతూ హక్కులను సాధించుకుందామని తెలియజేస్తూ నారీ లోకానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.'అని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఎమ్మెల్సీ కవిత ట్వీట్ చేశారు.

## జగమంతా శివోహం..శైవ క్షేత్రాలు కిటకిట..



హైదరాబాద్,మహాశివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఆలయాల్లో పరమశివుడిని కొలుస్తూ రుద్రాభిషేకాలు చేస్తున్నారు. ఎపి, తెలంగాణాలోని శైవ క్షేత్రాలైన శ్రీశైలం, శ్రీకాళహస్తి, వేములవాడ, కీసర ఆలయాలకు భక్తులు వేకువ జామున నుంచే పోటెత్తారు. శ్రీకాళహస్తి ఆలయంలో గురువారం అర్ధరాత్రి దాటాక భక్తులను దర్శనానికి ఆలయంలోకి అనుమతించారు. శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బాపట్ల జిల్లా చినగంజాం మండలం సోపిరాల, కొత్తపాలెం శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

వేములవాడ, కీసర లో ప్రత్యేక అభిషేకాలు

ఇక, తెలంగాణ రాష్ట్రంలోని వేములవాడ రాజన్న ఆలయం, కీసర రామలింగేశ్వరస్వామి ఆలయం, కాళేశ్వరం, చెర్వుగట్టు లింగమంతుల ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకుంటున్నారు. వరంగల్‌లోని ప్రసిద్ధ ఆలయమైన వేయిస్తంభాల గుడిలో పునర్మిర్మాణం చేసిన కళ్యాణమండపాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించారు. కుటుంబ సమేతంగా వేయి స్తంభాల గుడిలో పూజలు చేశారు.

వేయి స్తంబాల ఆలయంలో భక్త జనం

మహా శివరాత్రి సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో శైవక్షేత్రాలు భక్తులతో రద్దీగా మారాయి. అర్ధరాత్రి నుంచే మహాశివునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. వరంగల్ వేయిస్తంభాల ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. నగరంలోని వేయి స్థంబాల దేవాలయం, సిద్దేశ్వరాలయం, కురవి శ్రీ వీరభద్రేశ్వరుడి ఆలయాలుభక్తులతో కిటికిటలాడుతున్నాయి. అయినవోలు మల్లికార్జున స్వామి ఆలయం, పాలకుర్తి సోమేశ్వరాలయాలకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఈ ఆలయాల్లో అభిషేకం చేసుకునేందుకు తెల్లవారుజామున నుంచి భక్తులు బారులు తీరారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జాగారం, ఉపవాసం చేసే వారికొసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

కాళేశ్వరంలోనూ భక్త జన వాహిణి..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో కూడా మహాశివరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే భక్తులు కాళేశ్వర ముక్తీశ్వరుని దర్శనానికి క్యూ కట్టారు. ఇతర జిల్లాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్ గడ్ నుంచి భక్తులు తరలివస్తున్నారు. త్రివేణి సంగమంలో స్నానాలు ఆచరించి, గోదారి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేసి, మారేడు దళాలతో సమర్పిస్తున్నారు.ఉమ్మడి నల్గొండ జిల్లావ్యాప్తంగా ఉన్న శివాలయాలు శివనామ స్మరణతో మారుమోగుతున్నాయి. పానగల్లులోని ఛాయా, పచ్చల సోమేశ్వర ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామి వారిని దర్శించుకొని అభిషేకాలు చేస్తున్నారు. సూర్యాపేట పిల్లలమర్రి, మేళ్ల చెర్వు స్వయంభు శంభులింగేశ్వర స్వామి ఆలయాల్లో భక్తుల ఆధ్యాత్మిక సందడి నెలకొంది. చెర్వుగట్టు పార్వతీజడల రామలింగేశ్వర స్వామి, వాడపల్లి ఆగస్తేశ్వర స్వామి దేవాలయాలల్లో భక్తులు భక్తి ప్రపత్తులతో పూజలు నిర్వహిస్తున్నారు భక్తుల కోసం ఆలయ కమిటీ సభ్యులు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. మంచి నీటి సౌకర్యం కల్పించారు.ఖమ్మం జిల్లాలోని శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. గుంటి మల్లన్న , తీర్థాల, కూసుమంచి, పెనుబల్లి, మధిర , భద్రాచలంలలో శివాలయాల్లో భక్తులు బారులు తీరారు.

శ్రీశైలంలో పోటెత్తిన భక్తజనం

%అటు ఏపీలోనూ శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగుతున్నాయి. శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి 12 గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు. శివనామ స్మరణతో నల్లమల గిరులు మోగుతున్నాయి. శ్రీశైలం మల్లన్న క్షేత్రం, శ్రీకాళహస్తిలోని వాయులింగేశ్వరస్వామి ఆలయం, మహానంది ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శ్రీశైలంలో అర్థరాత్రి 2 గంటల నుంచే దర్శనాలు ప్రారంభమయ్యాయి. చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు నుంచి కూడా భక్తులు తరలివచ్చి ముక్కంటి దర్శనం చేసుకుంటున్నారు.శ్రీ సత్యసాయి జిల్లాలోని లేపాక్షిలో మహాశివరాత్రిని పురస్కరించుకుని శ్రీ దుర్గా, పాపనాశేశ్వర, వీరభద్ర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు శివపార్వతుల కళ్యాణోత్సవం, రుద్ర హోమం, దీపోత్సవం నిర్వహించనున్నారు.

కోటప్పకోండపై తిరునాళ్ల సందడి..

పల్నాడులోని కోటప్పకొండపై వైభవంగా మహాశివరాత్రి తిరునాళ్ళు ప్రారంభమయ్యాయి. తెల్లవారుఝామునుంచే భక్తులు పోటెత్తారు.., అమరావతి, గుంటూరు జిల్లాలోని క్వారీ, గోవాడ తదితర ప్రాంతాల్లోని శైవ క్షేత్రాల్లో భక్తుల రద్దీ నెలకొంది.

గోదావరి పుణ్య స్నానాలు..

రాజమండ్రిలో. గోదావరి స్థాన ఘట్టాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. చుట్టుపక్కల ప్రాంతాల నుండి భారీగా తరలివచ్చిన భక్తులు పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు.రాజమండ్రిలోని పుష్కర్ ఘాట్, కోటిలింగాలు ఘాట్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. శివాలయాల్లో తెల్లవారుజాము నుండి దర్శనాలు ప్రారంభమయ్యాయి.స్వామివారి దర్శనానికి ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు.రాజమండ్రిలో కోటిలింగాలు ఘాట్ నుండి పుష్కర్ ఘాట్ మీదుగా గౌతమి ఘాట్ వరకు భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గోదావరి గట్టు రోడ్లో భక్తులు రద్దీ దృష్ట్యా వాహనాల రాకపోకలు నిలిపివేశారు. స్నాన సమయంలో ఘట్టాల్లో. ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పడవలతో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు.

దేశ వ్యాప్తంగా శైవ క్షేత్రాలలో భక్తుల కిటకిట..

దేశవ్యాప్తంగా శివరాత్రి వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. శైవాలయాలన్నీ శివనామస్మరణతో మారుమోగుతున్నాయి. తెల్లవారుజామునే ఆలయాలకు చేరుకున్న భక్తులు.. పరమేశ్వరున్ని భక్తిశ్రద్ధలతో పూజిస్తున్నారు. కాశీ విశ్వనాథుని దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. మధ్యప్రదేశ్ ఉజ్జయిని మహంకాళ్ ఆలయంలో శివరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామి వారికి అర్చకులు పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ప్రయాగ్ రాజ్‌లో పుణ్యస్నానాలు చేసి నది ఒడ్డున దీపాలు వెలిగించి పూజలు చేస్తున్నారు. గోరఖ్ పూర్‌లో జార?ండి మహాదేవ్ ఆలయంలో పరమేశ్వరున్ని మారేడు దళాలతో భక్తులు పూజిస్తున్నారు.

## నియామకాల్లో మహిళలకు అన్యాయం.. ధర్నాచౌక్‌లో ఎమ్మెల్సీ కవిత దీక్ష




హైదరాబాద్: ప్రభుత్వ నియామకాల్లో మహిళలకు జరుగుతున్న అన్యాయానికి నిరసనగా ఎమ్మెల్సీ కవిత దీక్షకు దిగారు. హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో భారత్ జాగృతి ఆధ్వర్యంలో కవిత దీక్ష చేస్తున్నారు. సాయంత్రం 4 గంటల వరకు ధర్నా కొనసాగనుంది. నియామకాల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమాంతర రిజర్వేషన్లు అమలు చేసేలా విడుదల చేసిన జీవో నంబర్ 3ని రద్దు చేయాలన్నారు. ఈ దీక్షకు పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. ఎమ్మెల్సీ కవితకు ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, మాగంటి గోపినాథ్ మద్దతు తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో మహిళలకు సమాన రిజర్వేషన్లు (హారిజాంటల్) అమలుచేస్తూ గత నెల 8న ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ నియామకాల్లో మహిళలకు ప్రత్యేకంగా రోస్టర్‌ను మార్కు చేయకుండా ఓపెన్, రిజర్వుడు కేటగిరీల్లో 100లో 33 శాతం(1/3) రిజర్వేషన్లు అమలు చేసిన విషయం తెలిసిందే.. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి ఉత్తర్వులు జారీ చేశారు.రాజస్థాన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ వర్సెస్ రాజేష్ కుమార్ దరియా కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం.. ప్రస్తుతం కొనసాగుతున్న ఉద్యోగాల నోటిఫికేషన్‌కు సంబంధించిన నియామక ప్రక్రియలో ఈ మేరకు అమలు ఎంపికలో అవకాశం ఉంది. తెలంగాణ స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ నిబంధనలు –1996 ప్రకారం మహిళలకు ఓపెన్, రిజర్వుడు కేటగిరిల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే నిబంధన ఉంది.గ్రూప్ – 1 ఉద్యోగ ప్రకటనలో రోస్టర్ పాయింట్ 1 నుంచి తీసుకోవడంతో మహిళలకు ఎక్కువ పోస్టులు రిజర్వు అయ్యాయి. దీన్ని సవాల్ చేస్తూ అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో రాజస్థాన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ వర్సెస్ రాజేష్ కుమార్ దరియా సుప్రీం కోర్టు మార్గదర్శకాలను అమలు చేసింది. దీంతో టీఎస్‌పీఎస్సీ నియామకాల్లో సమాన రిజర్వేషన్లు అమలుచేయాలని 2022 డిసెంబర్ 2న మెమో జారీ చేసింది. ప్రస్తుతం.. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా సుప్రీంకోర్టు తీర్పునకు లోబడి టీఎస్‌పీఎస్సీతోపాటు అన్ని మహిళలకు సమానమైన రిజర్వేషన్లు అమలుచేస్తున్న ప్రభుత్వం ఆమోదించింది.

## నవజ్యోత్ సింగ్ సంచలన వ్యాఖ్యలు



పంజాబ్ : పంజాబ్ ముఖ్యమంత్రి (పంజాబ్ ముఖ్యమంత్రి) భగవంత్ మాన్ (భగవంత్ మన్)పై కాంగ్రెస్ నేత నవజ్యోత్ సింగ్ సిద్ధూ (నవ్‌జోత్ సింగ్ సిద్ధూ) సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓ సందర్భంలో భగవంత్ మాన్ తనను కలిశారని.. కాంగ్రెస్ పార్టీ (కాంగ్రెస్)లో చేరేందుకు ఆయన ఆసక్తి చూపారని తెలిపారు. తనకు డిప్యూటీగా పనిచేసేందుకు మాన్ సుముఖంగా ఉన్నారంటూ హాట్ కామెంట్స్ చేశారు.నవజ్యోత్ సింగ్ సిద్ధూ బీజేపీలో చేరుతున్నారంటూ గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ అంశంపై విలేకరులు సిద్ధూను ప్రశ్నించారు.

'మీరు బీజేపీలో చేరుతున్నారా..? లేదంటే మిమ్మల్ని ఎవరైనా సంప్రదించారా..?' అంటూ ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు సమాధానంగా ఆయన మాట్లాడుతూ.. 'నన్ను ఎవరైనా సంప్రదించారా అనే దాని గురించి మీకు ఓ విషయం చెప్పగలను. భగవంత్ మాన్ సాహబ్ ఓసారి నా వద్దకు వచ్చాడు. నేను అతనిని (మాన్‌ని) కాంగ్రెస్‌లో చేర్చుకుంటే.. తను నాకు అనుకూలంగా ఉండటానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పాడు. అలా లేదంటే నేను ఆమ్ ఆద్మీ పార్టీ (ఆమ్ ఆద్మీ పార్టీ)లోకి వెళ్లినా.. అతను నాకు అనుకూలంగా ఉండటానికి సిద్ధమే అని చెప్పాడు' అని సిద్ధూ పేర్కొన్నారు.అయితే, తాను రాహుల్, ప్రియాంకగాంధీకి బద్ధుడినై ఉన్నానని, వారిని విడిచిపెట్టి రాలేనని స్పష్టంగా చెప్పారు. తను కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్టయితే అధిష్ఠానంతో మాట్లాడతానని చెప్పానన్నాడు. ఆ తర్వాత ఈ విషయంలో ఇద్దరి మధ్య ఎలాంటి చర్చలూ జరగలేదని వివరించారు. పంజాబ్ ప్రజలకు సేవ చేయడమే తన ఏకైక లక్ష్యమని సిద్ధూ ఈ సందర్భంగా. సిద్ధూ చేసిన ఈ వ్యాఖ్యలు పంజాబ్ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి.

## వేయిస్తంభాల ఆలయంలో తిరిగి పూజలు ప్రారంభం..



హనుమకొండ: అలనాడు వేయిస్తంభాల గుడిని కట్టేందుకు 72సంవత్సరాలు పట్టిందని కేంద్ర మంత్రి, భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆలయంలో పునర్నిర్మించిన కల్యాణ మండపాన్ని ఆయన నేడు ప్రారంభించారు. కుటుంబ సమేతంగా వేయి స్తంభాల గుడి యాగశాలలో శాంతి హోమం చేశారు.ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏఎస్ఐ అధికారులకు చాలా పరిమితులున్నాయని, ఆ పరిమితుల్లోనే వాళ్లు పనిచేస్తారని, వీటి కారణంగా నిర్మాణం కాస్త ఆలస్యమైన మాట వాస్తవమేనన్నారు. దేశ చరిత్రలో కాకతీయుల పాలనాకాలం స్వర్ణయుగం లాంటిదన్నారు. వ్యవసాయం మొదలుకుని.. కళలు, సంస్కృతి, సంప్రదాయాలు, చేతివృత్తులకు వారు ఇచ్చిన ప్రాధాన్యత ఇవాళ్టికి కూడా రీసెర్చ్ టాపిక్ అని పేర్కొన్నారు. అలాంటి కాకతీయుల కళావైభవానికి ఇవాళ భక్తులకు అంకితమైనటువంటి ఈ వేయి స్తంభాల మండపం ఓ మచ్చుతునక అని అన్నారు.మధ్యయుగంలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేవాలయాలను ధ్వంసం చేశారన్నారు. తుగ్లక్ సైన్యం రామప్ప గుడి నుంచి వరంగల్ కోట వరకు అన్నింటినీ దెబ్బతీసిందని చెప్పారు. తాజాగా పునర్నిర్మాణం చేసిన వేయి స్తంభాల గుడి కల్యాణ మండపంలో 132 స్తంభాలు ఏర్పాటు చేసినట్లు కిషన్‌రెడ్డి వివరించారు. కాకతీయుల శిల్ప కళా వైభవం అద్భుతమని కొనియాడారు. ప్రాచీన కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిదన్నారు.

వేయిస్తంభాల ఆలయ చరిత్ర..

1163లో కాకతీయ పాలకుడైన రుద్రదేవుడు ఈ ఆర్కిటెక్చురల్ మార్వెల్ (ఇంజనీరింగ్ అద్భుతం)ను నిర్మించారు. అప్పట్లోనే దీన్ని నిర్మించేందుకు 72ఏళ్లు పట్టిందని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి.1324–25లో తుగ్లక్ సైన్యం చేసిన దాడిలో ఈ మందిరం కొంతమేర ధ్వంసమైంది. దీంతోపాటుగా ఈ మందిరంలో ఉన్నటువంటి.. సూర్య, వాసుదేవ విగ్రహాలను తుగ్లక్ సైన్యం తీసుకెళ్లింది. మధ్యయుగ కాలంనాటి ఈ గుడి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక కేంద్రంగా ప్రత్యేకతను చాటుకుంది. ఇక్కడున్న మండపంలో గ్రామసభలు, నాట్య కార్యక్రమాలు నిర్వహించుకునేవారు.

2006లో వచ్చిన వరదలకు కుంగిన పిల్లర్లు ..

2006లోవచ్చిన వరదలు ఈ ఆలయంలోని పిల్లర్లలో భారీగా నీరు చేరడంతో కొన్ని కుంగిపోయాయి.. దీంతో ముందు జాగ్రత్తగా 132 స్తంభాలున్న కల్యాణ మండపాన్ని అప్పుడే కూల్చేశారు. ఆ తర్వాత అప్పుడే పునర్మిణ ప్రక్రియను ప్రారంభించారు.. అయితే వివిధ కారణాలతో ఈ నిర్మాణ క్రతువు ఆలస్యమైంది. 18 సంవత్సరాలకు నిర్మాణం పూర్తి కాగా, నేడు తిరిగి ఈ ఆలయంలో పూజలకు శ్రీకారం చుట్టారు..

## శివరాత్రి ఉత్సవాల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



వైరా, ఖమ్మం జిల్లా వైరా మండలం స్నానాల లక్ష్మీపురం గ్రామంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించి భక్తులకు అధికారులు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. స్నానాల లక్ష్మీపురంలో నాలుగు రోజులపాటు నిర్వహించే ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని ఆయన ఆదేశించారు. అనంతరం ఆలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నందిని దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ప్రజలకు, ప్రయాణికులకు, వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు వివరించారు. రాష్ట్ర నలుమూలల నుంచి లక్ష్మీపురానికి ప్రజల పోటెత్తారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వైరా గండుగల పాడు సమీపంలో శిరిడి సాయి మందిరం సమీపం నుంచి నేరుగా లక్ష్మీపురం దేవాలయం వరకు ఒక్క రోజులోనే రోడ్డు వేయడంతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మార్కు సంతరించుకుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయ అభివృద్ధికి నిధులు కూడా కేటాయించడంతో రానున్న రోజుల్లో ఉత్సవాలు మరింత ఘనంగా జరిగే అవకాశాలున్నాయి. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు ఉన్నారు.

## రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు పాటించాల్సిందే



అమరావతి: ఎన్నికల షెడ్యూల్ వెలువడిన వెంటనే రాజకీయ పార్టీలు ప్రవర్తనా నియమావళిని పాటించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) ముఖేష్ కుమార్ మీనా స్పష్టం చేశారు. సచివాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. నామినేషన్ల ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రచారంలో హెలికాప్టర్లు, వాహనాల వినియోగం, సభలు, సమావేశాలు, ఊరేగింపుల నిర్వహణకు ముందుగా తీసుకోవాల్సిన అనుమతుల వ్యవహారంపై సూచనలు చేశారు.ముఖ్యంగా ఎన్నికల ప్రచారంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు చేసే ఖర్చుపై సూచనలు చేశారు. పోలింగ్ ప్రక్రియతో పాటు కౌంటింగ్ రోజున రాజకీయ పార్టీలు, వాటి ప్రతినిధులు అనుసరించాల్సిన విధివిధానాలను వివరించారు. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను రాజకీయ పార్టీలు పాటించాలన్నారు.మార్గదర్శకాలపై అవగాహన కలిగి ఉంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి సందేహాలు, గందరగోళం ఉండవని అన్నారు. మరోవైపు రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై రాజకీయ పార్టీలు పలు అంశాలను సీఈవో దృష్టికి తీసుకెళ్లాయి.

## అన్నారంకు ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల బృందం



అన్నారం:నేషనల్ డ్యాం సెఫ్టీ అథారిటీ బృందం రెండో రోజు పర్యటిస్తోంది. ఇవాళ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్ట్ లోని అన్నారం సరస్వతీ బ్యారేజీకి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల బృందం చేరుకుంది. నిన్న రాత్రి రామగుండంలో బస చేసి అన్నారం బ్యారేజీకి చేరుకుని అక్కడ సీపేజీలు, బుంగలు, లీకేజీల ప్రాంతంలో పరిశీలిస్తున్నారు.కేంద్రజలసంఘం మాజీ చైర్మన్ చంద్ర శేఖర్ అయ్యర్ నేతృత్వంలో శాస్త్రవేత్తలు యు. సి. విద్యార్థి, ఆర్. పాటేల్, సీడబ్ల్యూసీ సభ్యుడు యస్.హెచ్.శివ కుమార్, రాహుల్ కుమార్ సింగ్, అమితాబ్ మీనాలు ఇరిగేషన్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. ఎన్‌డీఎస్‌ఏ కమిటీ సభ్యులు బ్యారేజ్‌పై నుంచి పరిశీలిస్తున్నారు.

సంపాదకీయం

శనివారం 09-03-2024

# ట్రిబ్యునళ్ల తీరుతోనే నీటి కష్టాలు

వందల నదులకు భారత్ పుట్టినిల్లు. అందుకే మన దేశాన్ని నదుల దేశంగా కూడా పిలుస్తారు. సింధు నుంచి కావేరి వరకు.. మొత్తం 400కు పైగా చిన్న, మధ్య తరహా, భారీ నదులు మన దేశంలో ఉన్నాయి. కానీ, గుక్కెడు నీటి కోసం తండ్లాట తప్పడం లేదు. బెంగళూరు, చెన్నై, ఢిల్లీ లాంటి నగరాలు తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ దుస్థితికి ప్రధాన కారణం ప్రభుత్వాలకు ముందుచూపు లేకపోవడమే. కాళేశ్వరం లాంటి భారీ ప్రాజెక్టులను నిర్మించకపోవడమే. ప్రభుత్వాలు మారుతున్నా, విధానాలు మారుతున్నా నీటి కష్టాలు మాత్రం తీరడం లేదు. రాష్ట్రాల మధ్య జల వివాదాలకు పరిష్కారం దొరకడం లేదు. దేశ అవసరాలకు సరిపడా నీళ్లున్నా.. జల వివాదాల కారణంగా కొన్ని ప్రాంతాలు కరవు సీమలుగా మారుతుండటం బాధాకరం. జల వివాదాల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వాలు నియమిస్తున్న ట్రిబ్యునళ్లు కోరలు లేని పులుల్లా మారిపోయాయి. ఇప్పటివరకు ఏ ఒక్క సమస్యను ట్రిబ్యునళ్లు పరిష్కరించకపోవడమే అందుకు నిదర్శనం. ట్రిబ్యునల్ వ్యవస్థ పాక్షిక న్యాయ వ్యవస్థగా పని చేస్తుంది. రాష్ట్రాల మధ్య జల వివాదాలు తలెత్తినప్పుడు వీటిని కేంద్రం ఏర్పాటు చేస్తుంది. 262 అధికరణం ప్రకారం.. ట్రిబ్యునళ్లను నియమించే అధికారం పార్లమెంట్‌కు రాజ్యాంగం కల్పించింది. అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టం–1956 ప్రకారం.. రెండు లేదా మూడు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల జగడాలను ఇవి పరిష్కరించాలి. కానీ, నేటి వరకు ఒక్క వివాదాన్ని కూడా ట్రిబ్యునళ్లు పరిష్కరించిన పాపానపోలేదు. మన దేశంలో ఇప్పటి వరకు 8 ట్రిబ్యునళ్లు ఏర్పాటయ్యాయి. గోదావరి, కృష్ణా, వంశధార, బియాస్, కావేరి, మహదాయి నదులకు సంబంధించి జల వివాదాల పరిష్కారం కోసం ఆయా ట్రిబ్యునళ్లను కేంద్ర ప్రభుత్వం నియమించింది. కావేరి జల వివాదాన్ని పరిష్కరించడంలో ట్రిబ్యునల్ విఫలమవడంతో కర్ణాటక–తమిళనాడు రాష్ట్రాలు సుప్రీంకోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చింది. కోర్టు ఆదేశాలతో 15,000 క్యూసెక్కుల నీరు తమిళనాడుకు వదిలారు. రావి–బియాస్ నదుల వివాదం హర్యానా, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల మధ్య చిచ్చురేపింది. ఈ వివాదం తారస్థాయికి చేరింది. కృష్ణా జలాలను పంపిణీ చేయడంలో ట్రిబ్యునళ్లు విఫలమవడంతో కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య జల వివాదాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. నర్మదా నది వివాదం కారణంగా సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నర్మదా ప్రాజెక్టు పూర్తవడానికి దాదాపు 30 ఏండ్లు పట్టింది. ఈ విధంగా దేశంలో అనేక వివాదాలు చెలరేగుతున్నా ట్రిబ్యునళ్ల తీరు మారడం లేదు. జల వివాదాలను పరిష్కరించాలనే ధ్యాసే లేకుండాపోయింది. అనుమతులు, ఇతర రాష్ట్రాల పేచీల కారణంగా రాష్ట్ర ప్రభుత్వాలు భారీ ప్రాజెక్టులను నిర్మించేందుకు జంకుతున్నాయి. తత్ఫలితంగా దేశంలో నీటి లభ్యత ఉన్నా.. సాగు, తాగునీటి కోసం కష్టాలు తప్పడం లేదు. మన దేశంలో ఏటా సగటు వర్షపాతం 900 సెంటీమీటర్లకు పైనే ఉంటుంది. రిజర్వాయర్లు, కాలువలు, ఎత్తిపోతల ప్రాజెక్టులు లేకపోవడంతో 70,000 టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలిసిపోతున్నది. నీటి లభ్యత ఉన్నప్పటికీ, పక్కనే నదులు పారుతున్నా పొలాలకు నీటిని పారించుకోలేని దుస్థితిని మన తెలంగాణ అప్పట్లో ఎదుర్కొన్నది. నేడు మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలు తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. 2050 నాటికి భారత్‌లో తీవ్రమైన కరువు సంభవిస్తుందని యూఎన్‌డీపీ, డబ్ల్యూఆర్ఐ తదితర అంతర్జాతీయ సంస్థలు హెచ్చరిస్తున్నాయి. కేంద్రీకృత వ్యవస్థ వల్ల రాష్ట్రాల స్వేచ్ఛను హరిస్తున్నాయని ట్రిబ్యునళ్లపై ఒక ఆరోపణ ఉన్నది. ఇది ప్రధానమైన సమస్య. రాష్ట్రాల మధ్య సఖ్యత కోసం ట్రిబ్యునళ్లు, కేంద్ర ప్రభుత్వాలు ఏనాడూ కృషి చేయలేదు. అధికారుల లోటు, రాజకీయ ఒత్తిడి కారణంగా జల వివాదాలు ఏటికేడు పెండింగ్ పడుతూనే ఉన్నాయి. సెంట్రల్ వాటర్ కమిషన్ నివేదికలను పరిగణనలోకి తీసుకోకపోవడం, నదీ జలాల బోర్డు సభ్యులతో సఖ్యత లేకపోవడం తదితర అంశాలు జల జగడాలను మరింత జటిలం చేస్తున్నాయి. ఈ విధంగా అనేక కారణాల వల్ల నీరు వృథాగా పోతున్నది. రాష్ట్రాలు సైతం ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. కుంటలు, చెరువులు, వాగులను పునరుద్ధరించి నీటి లభ్యతను పెంచేందుకు రాష్ట్రాలు కృషి చేయాలి. ఈ విషయంలో తెలంగాణ రాష్ట్రాన్ని, కేసీఆర్ విజన్‌ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలి. ఎత్తైన పీఠభూమిపై ఉన్న రాష్ట్రాలు తక్షణమే కాళేశ్వరం లాంటి భారీ ఎత్తిపోతల ప్రాజెక్టులను చేపట్టాలి. గంగా–కావేరి నదులను అనుసంధానం చేయాలి. నీటిపారుదల రంగంపై భారీగా మూలధన పెట్టుబడి పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రతి ఇంటికి తాగునీరు అందించే బృహత్తర ప్రణాళికలను చేపట్టాలి. ఆయా రాష్ట్రాలు సఖ్యతతో నదీ జలాల మళ్లింపుపై దృష్టి సారించాలి. అందుకు పాలకులు, ప్రభుత్వాలు చొరవ చూపాలి. ఈ విధంగా చేసినట్లయితే జల జగడాలకు చోటు ఉండదు. ట్రిబ్యునళ్ల తీర్పులు ఆలస్యం అయినప్పటికీ రాష్ట్రాల మధ్య సఖ్యతతో సాగు, తాగునీరు అవసరాల కోసం నదీ జలాలను ఉపయోగించుకోవచ్చు. అదే సమయంలో ట్రిబ్యునళ్ల వ్యవస్థలో ప్రక్షాళన జరగాల్సిన అవసరం ఉంది. కేంద్రీకృత విధానాలను కాకుండా ఆయా వివాదాలు నెలకొన్న రాష్ట్రాల సభ్యులను నియమించాలి. పారదర్శకంగా నీటి కేటాయింపులు జరపాలి. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు మళ్లీ సుప్రీంకోర్టు మెట్లు ఎక్కాల్సిన అవసరం లేకుండా ట్రిబ్యునళ్లు వివాదాలను పరిష్కరించాలి. నదీ జలాల పంపకాల కోసం హెల్సింకి నియమాలను పాటించాల్సిన అవసరం ఉంది. నదీ జలాల వివాదాల చట్టాన్ని సైతం సవరణ చేయాలి. సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్తేనే దేశంలో జల జగడాలు పరిష్కారం అవుతాయి. తద్వారా తాగు, సాగునీటి కష్టాలు తీరుతాయి.

# దానధర్మాలకు వీళ్లు దారిదీపాలు



న్యూఢిల్లీ,దాతృత్వాన్ని మించిన సుగుణం లేదు. సాటి మనిషికి సాయపడడమే మానవ జీవిత ఉత్కృష్ట కార్యం. ఎందుకో గానీ సృష్టిలోని ప్రాణి కోటిలో బుద్ధి వికాసం పొందిన మనిషిలోనే స్వార్థం పెరిగింది. కాకికి కష్టమొస్తే అన్ని చుట్టూ చేరుతాయి. కోతికి దెబ్బ తాకితే గుంపుగా బాధపడతాయి. మనిషి సాటివాడి కష్టానికి స్పందించడం మాత్రం కోల్పోయాడు. అందుకే వేమన పురుషులందు పుణ్యపురుషులు వేరయా అన్నాడు. మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు అని అందెశ్రీ పాట కట్టాడు. అయితే నూటికో కోటికో ఒక్కరు అన్నట్లు ఈ అపవాదును తొలగించుకొని ప్రయత్నం అక్కడక్కడా, అప్పుడప్పుడూ జరుగుతుంది. అలాంటి అరుదైన మహా దాతృత్వ, మానవీయ సంఘటనలు గత నెల ఈ భూమ్మీద రెండు కనబడ్డాయి. ఒకటి ఉస్మానియా యూనివర్సిటీకి గోపాల్ టి కృష్ణ అనే పూర్వ విద్యార్థి రూ. 5 కోట్ల భారీ విరాళం ఈయడం, మరోటి అరబ్ ఎమిరేట్స్ లోని ఒక భారతీయ వ్యాపారవేత్త ఫిరోజ్ మర్చంట్ రూ. రెండున్నర కోట్లు వెచ్చించి 900 ఖైదీలకు జైలు నుంచి విముక్తి కలిగించడం. ఈ స్థాయి ఆర్థిక స్థితి ఉన్నవాళ్లు ఎందరో ఉన్నా ఇలాంటి ఆలోచన రావడం వారి 'పుణ్య పురుష' లక్షణంగా కీర్తించక తప్పదు. ఓయు ఇంజినీరింగ్ కాలేజీలో గోపాల్ కృష్ణ 1968లో బిఇ చదివారు. ప్రస్తుతం అమెరికాలో స్థిరపడి అక్కడి రాజకీయాల్లో కూడా చురుకుగా ఉన్నారు. తాను చదివిన ఎలక్ట్రికల్ విభాగం అభివృద్ధి కోసం ఫిబ్రవరి 27 న అక్షరాల రూ. 5 కోట్లను వర్సిటీ అధికారులకు తెలియజేయండి. ఎందరో గొప్పవారిని తీర్చిదిద్దిన 106 ఒయు చరిత్రలో ఒక పూర్వ విద్యార్థి ఇంత భారీ విరాళాన్ని ప్రకటించడం ఇదే తొలిసారి. ఈ ధనసాయాన్ని ఉపయోగించేందుకు ఆధునిక తరగతి గదులు కాంప్లెక్స్ నిర్మించబడతాయి. వాటికి ప్రో. వి ఎం. గాడ్గిల్ ఆడిటోరియం అని, ప్రో. అబిద్ అలీ కమ్యూనిటీ హాల్ అని పేర్లు పెట్టాలని కృష్ణ ఉన్నారు. తనకు జరిగిన గౌరవ సభలో 'ఎంత ఇచ్చిన ఓయు రుణాన్ని తీర్చుకోలేను. ఇక్కడ చదువే నన్ను ఈ స్థాయికి తీసికెళ్ళింది' అని ఆయన అన్నారు. హైదరాబాద్‌లో వారి నివాసం నారాయణగూడలో ఉండేది. కృష్ణ తండ్రి శ్రీనివాసాచారి అబిడ్స్‌లోని మెథడిస్ట్ స్కూల్‌లో టీచర్‌గా పని చేశారు. తక్కువ వేతనంతో ఆయన పిల్లలను పైచదువులు ఇప్పించి తీర్చిదిద్దారు. ఆనాటి నిజాం ట్రస్ట్ చేసిన రూ. 1500 ఆర్థిక సాయం కూడా కృష్ణ అమెరికా చదువులకు తోడ్పడింది. అందుకు ప్రతిఫలంగా ఆయన రూ. 5 లక్షలు నిజాం ట్రస్టుకు తిరిగి ఇచ్చారు. ప్రస్తుతం 77 ఏళ్ల వయసున్న కృష్ణ అయోవాలో సొంత కంపెనీ స్థాపించి ఎవరికో ఉద్యోగాలు కల్పించారు. అయోవా రాష్ట్రానికి మూడు సార్లు చైర్మన్‌గా ఎంపికయ్యారు. ఆయన కొడుకులు సొంత వృత్తుల్లో ముగ్గురు స్థిరపడ్డారు. కృష్ణ తన ఆస్తిని వారికీ పంచకుండా దాతృత్వానికే. మరో అద్భుత దాత యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో స్థిరపడ్డ భారతీయుడు ఫిరోజ్ మర్చంట్. బంగారం, వజ్రాల వ్యాపారం చేసే ప్యూర్ గోల్డ్ సంస్థకు అధిపతి. 1989 నుండి దుబాయ్‌లో ఉంటూ ప్రముఖ వ్యాపారిగా ఎదిగిన ఆయనకు అరబ్బు దేశాల్లో 125 దుకాణాలు ఉన్నాయి. తన సంపాదనను వెచ్చించి ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ఆయన ముందున్నారు. 66 ఏళ్ల ఫిరోజ్ 2008లో ది ఫర్గాటెన్ సొసైటీని స్థాపించి ఇలాంటి సేవలు అందించారు. ఈ మధ్య రూ. రెండున్నర కోట్లు చెల్లించి ఆ దేశంలోని జైళ్లలో ఉన్న 900 ఖైదీలకు విముక్తి ప్రసాదించి వార్తల్లోకి ఎక్కారు. కోర్టులు విధించిన ఈ జరిమానాలు, చేసిన అప్పులు చెల్లించలేక జైలు శిక్ష అనుభవిస్తున్న రకంగా ఆయన ఆదుకుంటున్నారు. ఇప్పటి వరకు ఆయన 20 వేల ఖైదీలను ఈ రకంగా బయటికి రప్పించారు. ఈ సంవత్సరంలో ఫిరోజ్ మూడు వేల మంది ఖైదీలకు విడుదల చేయాలంటే లక్ష్యాన్ని పెట్టుకున్నారు. అందులో భాగంగానే ఇప్పటి వరకు 900 మంది విముక్తి పొందారు. ఈ ఏడాది ఫిరోజ్ లక్ష్యం నెరవేరడానికి ఇంకో రూ. 8 కోట్లయినా వెచ్చించక తప్పదు. రంజాన్ కానుకగా వారు ఇళ్లకు చేరాలని ఆయన ఆశ. ఇలా జైలు నుంచి బయటికి వచ్చినవారు తమ సొంత దేశానికి, వెళ్లేందుకు రవాణా ఏర్పాట్లు, ఇతర ఖర్చుల బాధ్యత తానే చూసుకుంటున్నారు. ముంబైలోని బెండి బజార్ లో పుట్టిన ఫిరోజ్ తండ్రి రియల్ ఎస్టేట్ బ్రోకర్గా పని చేసేవాడు. ఆయనది చాలీచాలని సంపాదన. ఒకే గదిలో ఎనిమిది మంది ఉండే స్థితి. పదకొండేళ్ల వయసులో ఆర్థిక ఇబ్బందులతో ఫిరోజ్ చదువు ఆపేసి తండ్రికి తోడుగా పనిచేసేవాడు. బతుకుతెరువు కోసం దుబాయ్ వచ్చి ఇప్పుడు మిడిల్ ఈస్ట్‌లోని అత్యంత ధనికుల జాబితాలో చేరాడు. ఈ ఇద్దరు దాతలు పేదరికంలోంచి ఎదిగివచ్చినవారే. ఉస్మానియా యూనివర్శిటీ ఎందరికో విద్యనందించి వారిని ప్రజాప్రతినిధులుగా, సాంకేతికంగా, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దారు. యూనివర్శిటీ మెట్లు ఎక్కి ఖాళీ చేతులతో వెళ్ళినవారు అరుదుగా ఉంటారు. అయితే కృష్ణ లాగా తన విద్యాలయానికి తిరిగి కొంతైనా ఇవ్వాలనే ఆలోచన వచ్చినవారు తక్కువే. ఈ రకంగా ఆ అమెరికా వాసి ఎందరికో ఆదర్శంగా నిలిచారు. కోట్లు ఇవ్వలేకున్నా లక్షలు, వేలు ఇచ్చే స్తోమత ఉన్నవారు లేరనలేము. ఒక్క ఒయు అంటే కాదు, ఎన్నో విధాలుగా చేతనైనంతలో తాము చదివిన బడి, పుట్టిన ఊరు ఋణం తీర్చుకునే ఆలోచన ఆవశ్యకం. ఇక విచారణ ఖైదీల విషయానికొస్తే మన దేశంలోనూ కోర్టు విధించిన జరిమానా చెల్లించలేక జైళ్లలో కొనసాగుతున్న వారి సంఖ్య తక్కువేమి లేదు. ఇప్పటికే ఢిల్లీ, యూపీ ప్రాంతాల్లో కొన్ని స్వచ్ఛంద సంస్థలు జరిమానాలు చెల్లించి ఖైదీల విడుదలకు సహకరిస్తున్నాయి. 2019లో ఉత్తరప్రదేశ్‌లో కొన్ని సంస్థలు డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదిన సందర్భంగా రూ. 19 లక్షలు చెల్లించి 131 మంది జరిమానా ఖైదీలను బయటకు రప్పించారు. అదే విధంగా ఆగ్రాకు చెందిన సత్యమేవ జయతే అనే స్వచ్ఛంద సంస్థ రూ. 5.4 లక్షలు చెల్లించి 20 మంది ఖైదీలకు బయటకు తెచ్చింది. ఇలా ఆ అభాగ్యులను ఆదుకోవాలని ఉంటే ఏ జైలుకెళ్లినా వారి జాబితా ఇచ్చి అధికారులు సహకరిస్తారు. గోపాల్ టి కె కృష్ణ, ఫిరోజ్ మర్చంట్ లాగా కోట్లు దానం చేయలేకపోవచ్చు. ఒకరు చిన్నగా ఆరంభిస్తే నలుగురు తోడై అదే పెద్ద సహాయానికి బాట పడవచ్చు.

# విన్నపాలతో కాదు...



హైదరాబాద్, మెతక వైఖరి, కరుకుతనం... మన పనులు సవ్యంగా సాగాలంటే ఈ కార్యక్రమాలలో దేన్ని ప్రదర్శించాలనేది, ప్రదర్శించడం ముఖ్యం. సమయాన్నిబట్టి, సందర్భాన్ని బట్టి లౌక్యాన్ని ప్రదర్శించూ ముందుకు సాగాలంటారు పెద్దలు. ఆ తెలివిని ప్రదర్శించకుండా సాదాసీదాగా ముందుకెళ్తే ఎదురు దెబ్బలు తప్పవన్నది అనుభవం చెప్పే పాఠం. మనకున్న గత అనుభవాల రీత్యా తెలంగాణకు రావాల్సిన నిధులు, ఆర్థిక సాయం, గ్రాంట్లు, రాష్ట్ర హక్కుల విషయంలో మోడీ సర్కారు తీవ్ర నిర్లక్ష్యాన్ని, అంతకుమించిన బాధ్యత రాహిత్యాన్ని ప్రదర్శిస్తూ వస్తోంది. గత పదేండ్ల నుంచి కొనసాగుతున్న తంతు ఇదే. ఇది ఇక్కడి అభివృద్ధికి, ప్రయోజ నాలకు గండి కొడుతోంది. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. .రాష్ట్రానికి సంబంధించిన డజనుకు పైగా సమ స్యలను ప్రధాని మోడీకి ఏకరువు పెట్టారు. ఆయా అంశాలు, ప్రాజె క్టులను పూర్తి చేసేందుకు ఇతోధికంగా ఆర్థిక చేయూత నందించాలంటూ ఆయన ప్రధానికి విజ్ఞప్తి చేశారు. వీటిలో మూసీ ప్రక్షాళన, ఐఏఎస్‌ల కేటాయింపు, ఎన్టీపీసీలో 2,400 మెగావాట్ల విద్యుత్ కేంద్రం ఏర్పాటు, జాతీయ నిర్మాణ నిర్మాణాలు ప్రధానంగా ఉన్నాయి. ఇవి గాక గత పదేండ్ల మోడీ పాలనలో తెలంగాణపై కొనసాగుతున్న వివక్ష, కొనసాగుతున్న పక్షపాత ధోరణికి అనేక దృష్టంతాలు మన ముందున్నాయి. కేంద్రం నుంచి ప్రతీయేటా రాష్ట్రానికి చట్టబద్ధంగా రావాల్సిన నిధులు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూ పంలో అందాల్సిన సాయాలకు కొర్రీలేస్తూ వస్తున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో గ్రాంట్ల రూపంలో రూ. 41,259 కోట్లు రావాల్సి ఉండగా, అందులో కేవలం 11 శాతాన్నే (రూ.4,532 కోట్లు) విదిల్చారు. పద్నాలుగో ఫైనాన్స్ కమీషన్ రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు రూ.817 కోట్లను విడుదల చేయాలంటూ సూచించినా ఇప్పటి వరకూ అతీగతీ లేదు. రాష్ట్ర పునర్ విభజన చట్టంలోని సెక్షన్ 94(2) ప్రకారం తెలంగాణలోని వెనుకబడిన జిల్లాలు, ప్రాంతాలకు రూ.1,350 కోట్లు ఇవ్వాల్సి ఉన్నా... కేంద్రం ఇప్పటి వరకు నోరు మెదపలేదు. ఇక మిషన్ భగీరథ నిర్వహణ కోసం రూ.2,350 కోట్లు, వివిధ రంగాల అభివృద్ధికి రూ. 3,024 కోట్లు, పన్నుల్లో తగ్గిన వాటా రూపంలో ఇవ్వాల్సిన మొత్తం రూ.723 కోట్ల (2020–21)ను కేంద్రమే చెల్లించా లంటూ పదిహేనో ఆర్థిక సంఘం గుర్తించింది. చెరు వుల పునరుద్ధరణ (మిషన్ కాకతీయ) కోసం మరో రూ.5 వేల కోట్లు సాయం చేయ లంటూ ఆ సంఘం సూచించింది. ఇవేవీ మోడీ గారి చెవికెక్కవు. వీటితోపాటు రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి కేటాయిం చాల్సిన గిరిజన యూనివర్సిటీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ప్రాజెక్టులకు జాతీయ హోదా వంటి అంశాలు ఎప్పుడో అటకెక్కాయి. తెలంగాణకు రావాల్సిన ఐటీఐఆర్‌ను చెప్పా పెట్టకుండా ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లారు. వీటిపై గత బీఆర్ఎస్ సర్కారు ఇదే మోడీకి వినతుల మీద వినతులు సమర్పించింది. ఆనాటి ముఖ్యమంత్రి సహా పలువురు మంత్రులు ప్రధానిని, ఇతర కేంద్రమంత్రులను కలిసి మొరపెట్టుకున్నారు. అయినా ఫలితం లేకపోయింది. గత పదేండ్లు బీజేపీని మోసం చేసిన బీఆర్ ఎస్.. ఆ తర్వాత ఇది పుల్లటి ద్రాక్షంటూ శాపనార్థాలందు కుంది. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీతో సహా అన్నింటిలో అది కాషాయ పార్టీతో అంటగట్టింది. తనకే ఎసరు పెడుతోందని అర్థమైన తర్వాత ఏడ్చి గీపెట్టినా రాష్ట్రానికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇప్పుడు నూతనంగా అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ రథసారథి రేవంత్ కూడా రెండు మూడుసార్లు మోడీని ఢిల్లీలో కలిశారు. ఆ తర్వాత తాజాగా రాష్ట్ర పర్య టనకు ఆయన విచ్చేసిన సందర్భంగా 'విన్నపాలు వినవలె...' అంటూ విజ్ఞాపన పత్రాలు సమర్పించారు. అంతే కాదు...'రాష్ట్రానికి పెద్దన్నలా వ్యవహరించి, సాయం చేయండి...'అంటూ అర్థించారు. కొందరు విమర్శిస్తున్నట్టుగా, కొన్ని పత్రికల్లో రాసినట్టుగా ఇదేమీ తప్పు కాదు. రాష్ట్ర ప్రయోజనాల రీత్యా కేంద్రంతో సఖ్యత కోసం ముఖ్య మంత్రి, ప్రధానిని కలవడాన్ని అర్థం చేసుకోవాలి. అయితే రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ సమాఖ్య వ్యవస్థను నీరుగార్చేస్తున్న కేంద్ర బీజేపీ సర్కార్ వైఖరిపై ఇదే కాంగ్రె ఎస్‌కు చెందిన కర్ణాటక సీఎం సిద్ధరామయ్య హస్తినలోని జంతర్ మంతర్ వద్ద ధర్నాకు దిగిన సంగతి రేవంత్ మరిచిపోకూడదు. ఇదే తరహాలో సమాఖ్య వ్యవస్థ బలోపేతం, లౌకికత్వ పరిరక్షణ, మతోన్మాదానికి వ్యతిరేకంగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఇటీవల ఢిల్లీలో గళమెత్తిన సంగతిని తెలంగాణ సీఎం గుర్తు చేసుకోవాలి. ఆయన ఉద్యమానికి తమిళ నాడు సీఎం స్టాలిన్ మద్దతు తెలిపిన విషయాన్నీ మననం చేసుకోవాలి. ఈ రకంగా దక్షిణాదిలోని మూడు రాష్ట్రాల కేంద్రం తీరును, మోడీ సర్కారు వైఖరినీ దునుమాడుతున్న తరుణంలో మనం కేవలం వినతులు, విజ్ఞప్తులతోనే సరిపుచ్చితే అది వృథా ప్రయాస అవుతుంది. ఇదే సమయంలో కేంద్రంతో ఘర్షణ వైఖరి చేపడితే.. పనులు కావంటూ కేసీ ఆర్ పాడిన పాతపాటే అందుకుంటే ఉప యోగం ఉండదంటూ సిద్ధరామయ్యను, విజయన్‌ను, స్టాలిన్‌ను చూసినా రేవంత్ అర్థం చేసుకుంటే మంచిది. అందుకే తెలంగాణ హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు 'బడే భారుపై చోట భారు' ఆందోళనలు చేపట్టాల్సిందే. పోరాట పంథాను ఎంచుకోవాల్సిందే..

## ప్రత్యేక స్పోర్ట్స్ పాలసీ కావాలి

హైదరాబాద్,ఓట్ల కోసం పథకాలు కాకుండా క్రీడాకారులను ప్రోత్సహించేలా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలి. అందుకు క్రీడా పాలసీని ప్రకటించాలి. మెరికల్లాంటి క్రీడాకారులను తయారు చేసేందుకు ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం కనీసం ఇప్పటి నుంచయినా ప్రయత్నించాలి. బాల్యంలోనే క్రీడాంశాలపై మక్కువ కల్పించి ప్రత్యేక స్పోర్ట్స్ స్కూళ్లను తెలవాలి. అందుకు ఎంత ఖర్చయినా వెరవకుండా ముందుకు సాగాలి. ఇవాళ ఇంట్లో ప్రతి మగపిల్లాడికి బ్యాట్ పట్టడం తప్ప మరో క్రీడ తెలియకుండా పోతోంది. క్రికెట్ మాత్రమే కాదు.. బ్యాడ్మింటన్ సహా అనేక ఆటలు ఉన్నా యన్న సంగతి ముందుగా తెలియ చెప్పాలి. మన ఒకప్పుడు హాకీ క్రికెట్ కంటే మిన్నగా అభిమానుల ఆదరణకు నోచుకుంది కానీ.. తర్వాత భారత జట్టు ప్రదర్శన లాగే దానికున్న ఆదరణా పడిపోయింది. అది మన జాతీయ క్రీడ అయినా దానిని పక్కన పెట్టేశాం. హాకీతో పాటు మిగతా ఆటలన్నీ కూడా ఉన్నా వాటిని ఆదరించుకోవడం లేదు. నిరాదరణ కారణంగానే కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, తదితర క్రీడలన్నీ కనుమరుగవుతున్నాయి. ప్రైవేట్ ప్రోత్సాహంతో సింధులాంటి వాళ్లు షటిల్

# గ్రాసం కోసం ఎదురుచూపు

చిత్తూరు,పాలఉత్పత్తిలో జిల్లా దేశంలోనే ప్రథమస్థానంలో వుంది. అయితే దానికి తగ్గట్టుగా పాడి పశువులకు పశుగ్రాసం అందడం ఇబ్బందిగా ఉంది. జిల్లాలో పాడి రైతుకు అప్పుడే కష్టకాలం మొదలైంది. మార్చి ప్రారంభంలోనే ఎండుగడ్డికి కొరత ఏర్పడడంతో నాలుగైదు నెలల పరిస్థితి ఎలా ఉంటుందో అని పాడిరైతులకు ఆందోళన కల్గిస్తోంది. మార్చి నుంచి జూన్ వరకు ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో ఎండుగడ్డి కూడా దొరకని పరిస్థితి ఎదురవుతుంటుంది. రానున్న 90 రోజులకు అంటే మార్చి నుంచి మే నెలాఖరు వరకు పశుగ్రాసం అవసరం. పశుగ్రాసం కొరత తీర్చడానికిగాను రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది అమలు చేసిన పథకాలన్నీ ప్రస్తుతం అమలులో వున్నా నామమాత్రంగానే కొనసాగుతునాయి. పడమటి మండలాల్లో పశుగ్రాసం కొరత తీవ్రంగా వుంది. దాంతో తూర్పు ప్రాంతానికి చెందిన శ్రీకాళహస్తి, ఏర్పేడు, బీఎన్‌కండ్రిగ, వరదయ్యపాళెం తదితర మండలాలనుంచి ఎండుగడ్డిని లారీలు, ట్రాక్టర్లలో తెచ్చుకుంటున్నారు. అక్కడి వ్యాపారులు పడమటి మండలాలకు తీసుకొచ్చి ఒక ట్రాక్టరు ఎండుగడ్డి అమ్ముకుంటున్నారు. పూతలపట్టు మండలంలోని రంగంపేట క్రాస్, పాకాల మండలంలోని నేంద్రగుంట తదితర ప్రాంతాల్లో రోజుకు 20 నుంచి 25 లోడ్ల ఎండుగడ్డి విక్రయిం చేస్తున్నారు. జిల్లాలో పశుగ్రాసం కొరతను తీర్చేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. జిల్లాలో పశువులకు అవసరమైన వరిగడ్డి, పచ్చిగడ్డికి ప్రత్యామ్నాయంగా పాతరగడ్డి, దాణామృతం రాయితీపై పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# 'బస్తీ మే సవాల్'..!

హైదరాబాద్, రానున్న లోక్‌సభ ఎన్నికల వేళ, హైదరాబాద్ సీటు కేంద్రంగా మారుతున్న రాజకీయ సమీకరణాలు మజ్లిస్ పార్టీకి చుక్కలు చూపిస్తున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్, బీజేపీల దూకుడుతో మజ్లిస్ కంచుకోటగా ఉన్న హైదరాబాద్ ఎంపీ సీటులో పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. దీంతో ఈసారి అక్కడ ఊహించని ఫలితాలు రాబోతున్నాయనే విశ్లేషణలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్ పార్లమెంటు సీటు పరిధిలో మలక్‌పేట్, కార్వాన్, గోషామహల్, చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, బహదూర్‌పురా అసెంబ్లీ నియోజక వర్గాలున్నాయి. 1984 నుంచి 1999 వరకు ఇక్కడ ఎంఐఎం నాటి అధినేత సలావుద్దీన్ ఒవైసీ గెలవగా, నాటి నుంచి నేటి వరకు అసదుద్దీన్ విజయం సాధిస్తూ వచ్చారు. కానీ, ఈ 40 ఏళ్లలో ఎంఐఎం రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీతో అనధికార పొత్తు కుదుర్చుకోవటం వల్లనే ఈ విజయాలన్నీ సాధ్యమయ్యాయని అందరికీ తెలిసిన విషయమే. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సీట్ల జోలికి తాను రాననీ, అందుకు బదులుగా పాతబస్తీని తమకు వదిలేయాలనే షరతు మీద ఆ పార్టీ ఇన్నాళ్లూ అక్కడ తిరుగులేని హవాను కొనసాగించింది. ఈ ఎంపీ స్థానం పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో, గత శాసన సభఎన్నికల్లో గోషామహల్ స్థానాన్ని బీజేపీ గెలుచుకోగా, యాకుత్‌పురాలో ఎంబీటీ కేవలం 878 ఓట్ల తేడాతో ఓడిపోయింది. ఇక మలక్ పేట స్థానంలో కాంగ్రెస్‌కు చెప్పుకోదగ్గ ఓట్లు వచ్చాయి. ఆ పొరుగునే ఉన్న నాంపల్లి సీటును కాంగ్రెస్ కేవలం 2037 ఓట్లతో చేజార్చుకుంది. గత అసెంబ్లీ ఎన్నికల వేళ అధికారంలో ఉన్న బీఆర్ఎస్ వీటిలో ప్రతిచోటా తన అభ్యర్థిని నిలిపి విపక్ష ఓట్లను చీల్చినా, హైదరాబాద్ ఎంపీసీటు పరిధిలోని ఏడు స్థానాల్లో కేవలం అయిదింటిలోనే ఎంఐఎం హవా కనిపించింది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావటం, పాత బస్తీలో ఉన్న బీఆర్ఎస్ నేతలంతా కాంగ్రెస్ కండువా కప్పుకోవటం మొదలు కావటంతో ఇప్పుడు ఒవైసీ వచ్చే ఎంపీ ఎన్నికల్లో గెలుపుకోసం కొత్త దారులు వెతకాల్సి వస్తోంది. ఎన్నికల ఫలితాలు వచ్చిన వారానికే ఎన్నడూ లేని విధంగా, అసదుద్దీన్ ఒవైసీ తన నియోజక వర్గంలో వరుసగా అభివృద్ధి పనులను ప్రారంభించటం, పనుల పురోగతిని సమీక్షించడానికి తనిఖీలకు దిగారు. ఈ క్రమంలోనే మార్చి 2న జరిగిన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని గతంలో కంటే బాగా జరిపే ప్రయత్నం చేయటం, పాతబస్తీ నలుమూలల నుంచి ర్యాలీలు తలపెట్టి పెద్దసంఖ్యలో కార్యకర్తలు పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలివచ్చేలా కార్యక్రమాలు రూపొందించారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ పాతబస్తీలోని ఇతర పార్టీల్లోని కార్యకర్తలను చేర్చుకోవటంలో బిజీగా ఉంది. ఇప్పటికే బీఆర్ఎస్ నేతలంతా కాంగ్రెస్ పంచన చేరగా, బీజేపీలోని అసంతృప్తులు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. అదే సమయంలో ఎంబీటీతో పొత్తుకు కాంగ్రెస్ సిద్ధపడుతోంది. ఇక్కడ ఒవైసీని ఓడించగలిగితే పాతబస్తీకి బయటి ముస్లిం మైనారిటీలంతా తనవైపు మళ్లే అవకాశం ఉందనేది కాంగ్రెస్ అంచనా. ఫిరోజ్ ఖాన్, అజారుద్దీన్ వంటి నేతల ప్రచారంతో మైనారిటీల మనసు గెలిచేందుకు ఆ పార్టీ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. పాతబస్తీలో అనాదిగా ఎంఐఎం నేతలుగా ఉన్న వారి పిల్లలు, విద్యాధికులు ఇప్పుడు కాంగ్రెస్ వైపు చూడటం ఆ పార్టీకి ఊరట కలిగించే విషయం. ఇక, ఆది నుంచి ఈ సీటులో ఎంఐఎంకు ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న కమలనాథులు ఈసారి మాధవీలత అనే కొత్త ముఖాన్ని తెరమీదికి తెచ్చారు. సేవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో హిందీలో మాట్లాడుతూ, స్థానికులతో మమేకమవుతూ హిందూ ఓట్లను ఒక్కటి చేయగలిగితే తమ గెలుపు సాధ్యమేనని బీజేపీ నమ్ముతోంది. దీనికి తోడు కాంగ్రెస్– ఎంబీటీల కారణంగా మైనారిటీ ఓట్లు భారీగా చీలతాయని, అది తమకు లాభిస్తుందని బీజేపీ లెక్కలు వేసుకుంటోంది. పైగా, హైదరాబాద్ ఎంపీ ఎన్నికలో స్థానిక అంశాలేవీ చర్చకు రావని, ఇక్కడ కేవలం ముస్లింల ప్రతినిధిగా ఒవైసీ, హిందువుల తరపున బీజేపీ పార్టీ గుర్తు, మోదీ మాత్రమే నిలుస్తారని, అదే జరిగితే పాతబస్తీలోని 8 లక్షల ఓట్లలో మెజారిటీ తనకే వస్తుందని వారి అంచనా. ఇక అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన బీఆర్ఎస్ ఎంఐఎంతో తన దోస్తీని కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, గతంలో మాదిరి స్పందన ఎంఐఎం నుంచి కనిపించటం లేదు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ కొత్త అసెంబ్లీలో ప్రొటెం స్పీకరుగా అక్బరుద్దీన్ ఒవైసీకి అవకాశం కల్పించటం, సీఎం రేవంత్ రెడ్డి అక్బరుద్దీన్‌తో కలిసి మూసీ తీర ప్రాంతం అభివృద్ధిపై చర్చించటం, హైదరాబాద్ నగర అభివృద్ధిపై జరిగిన సమీక్షలో అక్బరుద్దీన్ మాటకు సీఎం ఇచ్చిన ప్రాధాన్యం కూడా బీఆర్ఎస్‌కు గుబులు పుట్టిస్తున్నాయి. గత పదేళ్లుగా బీఆర్ఎస్ అండ చూసుకుని ఎంఐఎం పార్టీ స్థానికంగా ఉన్న మరో ముస్లిం పార్టీ అయిన ఎంబీటీ కార్యకలాపాలను పూర్తిగా అణచివేసింది. ఆ పార్టీ నేతల వ్యాపారాలను, ఆస్తుల మీద దాడికి దిగుతూ వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ ఎన్నికల్లో వారు నిలబడకుండా చేయటంలో విజయవంతమైంది. అయితే, అంతటి అణచివేతనూ అధిగమించి, మొన్నటి ఎన్నికల్లో ఆ పార్టీ యాకుత్‌పురాలో సత్తాచాటగలిగింది. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ గనుక స్నేహ హస్తం అందిస్తే పాతబస్తీ రాజకీయాల మీద ఎంబీటీ, కాంగ్రెస్‌లు పైచేయి సాధిస్తాయనీ, అది తమ రాజకీయ భవిష్యత్తుకు చరమగీతం పాడుతుందని ఎంఐఎం కంగారు పడుతోంది. అందుకే ఆ పార్టీ బీఆర్ఎస్‌కు కాస్త దూరం జరిగి, కాంగ్రెస్‌తో సత్సంబంధాలు కొనసాగిస్తూ, ఈ ఎంపీ ఎన్నికల పరీక్షలో గెలవాలనే ప్రయత్నంలో ఉందనే వార్తలూ వినిపిస్తున్నాయి.

# దేశంలో పేదరికం తగ్గిందా?.. వాస్తవాలను విస్మరిస్తున్న కేంద్రం..



న్యూఢిల్లీ, గడిచిన దశాబ్దకాలంలో 5 శాతం మంది భారతీయులు పేదరికం నుంచి బయటపడ్డారని కేంద్ర ప్రభుత్వం ఇటీవల గొప్పగా ప్రకటించింది. 2011-12 కుటుంబ వినిమయ వ్యయ సర్వేతో పోలుస్తూ.. నీతి ఆయోగ్ తన నివేదికలో ఈ విధంగా పేర్కొం ది. కానీ, 2011-12 సర్వేలోని ప్రమాణాలను ప్రభుత్వం తీసుకోకుండా.. ప్రస్తుత ఆదాయం, రూ.లు, ఉచిత పథకాల ఆధారంగా పేదరికం తగ్గిందని ప్రకటించడం. ఈ విధానం ఏ మాత్రం సమంజసం కాదని ఆర్థికవేత్తలు చెప్తున్నారు. పేద, మధ్య తరగతి నడ్డి విరుస్తుంటే 'పేదరికం తగ్గింది' అని బీజేపీ సర్కార్ గొప్పలకు పోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ముఖ్యంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎన్నడూ లేనివిధంగా ఈ మధ్యకాలంలో నిరుద్యోగం పెరిగిపోయింది. ఏటా లక్షల మంది యువత డిగ్రీ, బీటెక్ పట్టాలు తీసుకొని జాబ్ మార్కెట్లోకి అడుగుపెడుతున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలులేక కోట్ల మంది నిరుద్యోగులు రోడ్ల వెంట తిరుగుతున్నారు. ఆకలికి అలమటిస్తున్నారు. ఈ వాస్తవాలను విస్మరిస్తున్న కేంద్రం పేదరికం తగ్గుతుందని చెప్పడం హాస్యాస్పదం. విగ్రహాలు నిర్మిస్తూ, సామాన్యులకు అందుబాటులో లేని వందేభారత్ రైళ్లను ప్రవేశపెడుతూ.. ఇదే అభివృద్ధి అని ప్రజలను పాలకులు మభ్యపెడుతున్నారు. త్వరలో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్ అవతరిస్తుందని చెప్తూ పేదరికంపై అసత్య ప్రచారం చేస్తున్నారు. ప్రజల కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డ కూడా లేకుండా కోట్ల మంది భారతీయులు ఇప్పటికీ దీనావస్థలో బతుకుతున్నారు. అందుకే అటు కేంద్రం, ఇటు రా రాష్ట్ర ప్రభుత్వం, సంక్షేమ పథకాలు అమ లు చేస్తున్నాయి. రేషన్ బియ్యం ఇచ్చా యి. వాస్తవానికి ప్రజలు పేదరికం నుంచి బ యటపడితే ఉచిత, సంక్షేమ పథకాలు తగ్గాలి కదా! మరి రోజురోజుకు పెరగడం ఏమిటి?నిజంగా పేదరికం తగ్గితే వలసలు ఆగాలి కదా? రోజురోజుకు అంతర్గత, వలసలు పెరగడం దేనికి సంకేతం? కనీసం తాగునీరు కూడా దిక్కులేని ఆవాసాలు నేటికీ అనేక చిత్రాలలో కనిపిస్తుండటం విచారకరం. ఇప్పటికీ గిరిజనులు డోలీలను ఆధారం చేసుకొని ప్రయాణిస్తున్నారు. విద్యుత్తు సరఫరాకు నోచుకోక లక్షల ఇండ్లు అంధకారంలోనే మగ్గుతున్నాయి. ఆకలి సూచీలో మన స్థానం ఏంటో అందరికీ తెలుసు. నిత్యావసర సరుకులు, డీజిల్, పెట్రోల్ ధరలు ఎలా మండుతున్నాయో.. ఆ మంటల్లో మన వేతనాలు ఎలా కరిగిపోతున్నాయో పాలకులకు తెలియడం లేదా? కేవలం సెన్సెక్స్ నిఫ్టీ సూచీలు రికార్డు స్థాయిలో రాణించడం, ప్రతీ నెలా రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లు నమోదైతే దేశం అభివృద్ధి చెందిందా? 'మేడిపండు చూడ మేలిమై ఉండు' అన్నట్టు ఉంది మన దేశ ఆర్థిక పరిస్థితి. పేద, మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలు ఎలా ఉన్నాయో ఇకనైనా పాలకులు గ్రహించాలి. ప్రభుత్వ అనుకూల సంస్థల లెక్కలకు, వాస్తవ పరిస్థితులకు మధ్య ఉన్న అంతరాన్ని తెలుసుకోవాలి.ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లోనూ వ్యవసాయ రంగానికి తక్కువ నిధులు కేటాయించారు. రాయితీలపై కోత విధించారు. ఉన్నత విద్యా రంగానికి కేటాయింపులు అంతమాత్రమే. ప్రత్యేకించి యూజీసీకి 60 శాతం మేర నిధులు తగ్గించారు. నేటికీ మన దేశ ఆర్థికవ్యవస్థకు వెన్నెముక వ్యవసాయ రంగమే. అటువంటి రంగానికి నిధుల్లో కోత విధించడం ఆందోళన. దేశ రాజధానిలో తమ న్యాయపరమైన హక్కుల కోసం రైతులు అవిశ్రాంతంగా పోరాడుతున్నారు. వారి ప్రధాన డిమాండ్ అయిన కనీస మద్దతు ధరకు నేటికీ మోదీ సర్కార్ భరోసా ఇవ్వడం లేదు. దీన్నిబట్టే రైతులకు పాలకులు ఇస్తున్న ప్రాధాన్యత ఏంటో అర్థం చేసుకోవచ్చు.పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఇప్పటికైనా రైతులు, దేశ ప్రజల వాస్తవాలను గ్రహించాలి. సామాన్యులు, రైతులు, యువత ఆశయాలను నెరవేర్చే పార్టీలకు ప్రజలు అండగా నిలవాలి. ఓటును సద్వినియోగం చేసుకోవాలి. పేదరికం లేని భవిష్యత్తు భారత్‌ను నిర్మించే దిశగా అడుగులు వేయాలి. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడేవారికి అండదండలు అందించాలి. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడేవారి పక్షాన నిలబడాలి. అప్పుడే రాజ్యాంగ స్ఫూర్తికి ప్రతిరూపంగా నవ భారత్ ఆవిష్కరిస్తుంది.

# ఆర్థికంపై ఫోకస్?! అన్వేషిస్తున్న రేవంత్ సర్కారు



హైదరాబాద్,రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు నానాటికీ ఆందోళనకరంగా మారుతున్నాయి. లెక్కకు మించిన సంక్షేమ పథకాలు, పేరుకుపోయిన వేల కోట్ల పెండింగ్ బిల్లులు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ముందు మార్గలేవీ కనిపించడం లేదు. ఆమ్దానీ తక్కువ.. ఖర్చు ఎక్కువ అన్నట్లుగా ఆర్థిక అంచనాలు మారిపోయాయి. మారిన సర్కారు సరే.. మరి బిల్లులెట్లా? అనే ప్రశ్న అటు కాంట్రాక్టర్లను, ఇటు ప్రభుత్వ వర్గాలనూ వెంటాడుతున్నాయి. భారీగా నిధులు అవసరం ఉన్నాయి. అయినా గత ప్రభుత్వంలో పనిచేసిన కాంట్రాక్టర్లకు రేవంత్ సర్కారు ఫండ్స్? సమకూర్చడంపై దృష్టిపెట్టినట్టు తెలుస్తోంది. కాగా, ఆలస్యమైన బిల్లులతో కాంట్రాక్టర్ల ఆందోళన చెందుతున్నట్టు సమాచారం. క్షేత్రస్థాయిలో అసంపూర్తి నిర్మాణాలను పూర్తిచేసే మార్గాలను కూడా పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. అధికారిక సమాచారం మేరకు.. రాష్ట్ర వ్యాప్తంగా అన్నిశాఖల ద్వారా పూర్తియిన వివిధ కాంట్రాక్టు పనులకు సంబంధించి మొత్తం పెండింగ్ బిల్లుల సంఖ్య 4,78,168 లక్షలుగా ఉంది. వాటిని చెల్లించేందుకు ప్రాథమిక అంచనాల మేరకు నిధుల అవసరం రూ.40,154 కోట్లు అవసరమని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

పెరిగిన సంక్షేమ పథకాల వ్యయం..

అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలతో పాటు ఇప్పటికే అమల్లో ఉన్న అనేక సంక్షేమ పథకాలను ముందుకు తీసుకుపోవాల్సిన బాధ్యత, అవసరం కాంగ్రెస్ ప్రభుత్వం ముందు నిలిచింది. ఈ పరిస్థితుల్లో సంక్షేమ పథకాల వ్యయం అనేక రెట్లు పెరిగిపోయింది. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుకే సుమారుగా రూ.66వేల కోట్లు అవసరమవుతున్నాయి. ఈ పరిస్థితుల నుంచి భయటపడేందుకు నిధుల సమీకరణ దిశగా సర్కారు మార్గాలను అన్వేషిస్తోంది. అయితే.. ఆర్థిక పరిస్థితుల నుంచి బయటపడటం ఇప్పటికిప్పుడు అంత ఈజీ కాదని ఆర్థిక రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

అదనపు రుణాల కోసం ప్రయత్నాలు..

గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో పెట్టిన బిల్లులు సహా వివిధ పథకాలు, ఉద్యోగులకు సంబంధించి నిధుల సమీకరణపై రేవంత్? ప్రభుత్వం దృష్టి సారించింది. ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలను సడలించి అదనంగా రుణాలు తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఈ త్రైమాసికంలో అనుమతిస్తే బిల్లుల చెల్లింపులకు నిధులు సమకూరుతాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ పథకాలు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులకు సంబంధించి నిధుల సమీకరణపై దృష్టి సారించింది. అన్నీ కలిపి మొత్తం 4 ,78,168 బిల్లులు ఖజానాల్లో పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి రూ.40,154 కోట్లు చెల్లించాల్సి ఉంది. నిధులు లేకపోవడంతో వీటిలో కొన్ని ఏడాదికి పైగా పెండింగ్‌లో ఉన్నట్లు ఆర్థిక శాఖ తాజాగా నివేదించింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న ఆదాయంతో వీటన్నింటినీ ఇప్పటికిప్పుడు చెల్లించడం సాధ్యమయ్యే పని కాదు. దీంతో నిధుల సమీకరణ మార్గాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది.

పెండింగ్‌లో ఆ బిల్లులు ఎందుకున్నాయి..

కేంద్రం ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలను సడలిస్తే అదనంగా రుణాలు తీసుకునే అవకాశం ఉందని భావిస్తోంది. ఇదే సమయంలో అసలు 4.78 లక్షల బిల్లులు సుదీర్ఘ కాలంగా ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయన్న అంశంపైనా శాఖల వారీగా సర్కారు వివరాలు సేకరిస్తోంది. మామూలుగా ప్రతి ఆర్థిక ఏడాదిలో ప్రతి త్రైమాసికానికి బడ్జెట్ కేటాయింపుల ప్రకారం అన్ని శాఖలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఏప్రిల్ నెల నుంచి జూన్ నెల వరకు తొలి విడత, జులై మాసం నుంచి సెప్టెంబర్ వరకు రెండో విడత, అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు మూడో విడత, జనవరి నుంచి మార్చి వరకు నాలుగో విడత నిధులు విడుదల చేస్తూ.. అన్ని శాఖలకు ఆర్థిక శాఖ బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ జారీ చేస్తుంది. అయితే ఈ ఆర్థిక సంవత్సరం (2023-24)లో అసెంబ్లీ ఎన్నికల కారణంగా చాలా శాఖలకు మూడో త్రైమాసికం నిధులూ విడుదల చేయలేదు. అంతకుముందు రెండు త్రైమాసికాల్లోనూ కొన్ని ఎంపిక చేసిన శాఖలకే బడ్జెట్ విడుదలైనట్లు కొత్త సర్కారు లెక్కలు తేల్చింది.

గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులపై పరిశీలన

గతడిచిన రెండు త్రైమాసికాల్లో ఏ ఒక్క పెండింగ్ బిల్లు కూడా పరిష్కారం కాకపోవడంతో, అందుకోసం ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయకపోవడంతో క్షేత్రస్థాయిలో రాజకీయ వ్యవస్థతో ముడిపెట్టుకుని ఉన్న ఈ సమస్య నానాటికీ జఠిలమవుతోంది. కొన్ని శాఖలు ఖజానాకు సమర్పించిన బిల్లుల్లో ఐదారు నెలల నుంచి అసలు మొదటిదశ చెల్లింపులే జరగనివి కూడా ఉన్నాయి. వీటిల్లో ప్రభుత్వ ఉద్యోగుల పర్సనల్ బిల్లులే రూ.1000 కోట్లకు పైగా పెండింగులో ఉన్నాయి. ఇక పలు సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రభుత్వ వాటా కింద చెల్లించాల్సిన రాయితీ (సబ్సిడీ) నిధుల కోసం ప్రజలు సమర్పించిన బిల్లులు సైతం పెద్ద సంఖ్యలో ఉన్నాయి. పలు అభివృద్ధి పనులకు సంబంధించి వివిధ కాంట్రాక్టర్లు మొత్తం 10,169 బిల్లులు పెట్టగా, వీటికి చెల్లించాల్సిన రూ.10,498 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. ఇదిలా ఉండగా గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు పనులపై కాంగ్రెస్ సర్కార్ నిశితంగా తనిఖీలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ బిల్లులకు ఇప్పటికిప్పుడు బడ్జెట్ విడుదల చేస్తారా అనేది అనుమానమేనని అధికార వర్గాలు చెబుతున్నాయి.

లోక్‌సభ కోడ్ అడ్డంగా మారనుందా?


ఒకవేళ మార్చి నెలల్లో లోక్?సభ ఎన్నికల షెడ్యూల్ వస్తే మళ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి రానుంది. ఈ నేపథ్యంలో పార్లమెంటు ఎన్నికలు పూర్తయ్యే వరకు బిల్లులు పూర్తి స్థాయిలో చెల్లించడం సాధ్యమేనా అనే చర్చ సాగుతోంది. అయితే జనవరి నుంచి నాలుగో త్రైమాసికానికి సంబంధించి నిధుల విడుదల కోసం మరిన్ని రుణాలు తీసుకోవాలని సర్కార్ యోచిస్తోంది. ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలను సడలించి అదనంగా రుణాలు తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఈ త్రైమాసికంలో అనుమతించే అవకాశం ఉందని, అదే జరిగితే బిల్లుల చెల్లింపులకు నిధులు సమకూరుతాయని అధికారవర్గాలు తెలిపాయి.

# మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి రాజీనామా



అమరావతి,ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాలు చాలా వేగంగా మారుతున్నాయి. నోటిఫికేషన్ రాకుండానే ఊహించని మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ అనూహ్యంగా రాజీనామా చేశారు. అసలు ఆమె ఎందుకు రాజీనామా చేశారు. దీని వెనుకు ఉన్న రాజకీయ కారణమేంటనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఊపందుకుంది. జగన్‌కు అత్యంత నమ్మకమైన వైసీపీ నేతల్లో వాసిరెడ్డి పద్మ ఒకరు. అందుకే అధికారంలోకి వచ్చిన వెంటనే ఆమెను మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా చేశారు. ఆమె ఎమ్మెల్యే ఎన్నికల్లో పోటీ చేయాలని భావించినప్పటికీ సమీకరణాలతో ఆమెకు టికెట్ దక్కలేదు. దీంతో ఈ పదవిని జగన్ అప్పగించారు. హిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రభుత్వంపై ఈగ వాలనీయకుండా చూసుకున్నారు. ప్రభుత్వానికి మహిళలకు మధ్య వారధిలా నిలిచారు. మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, దిశ చట్టం గురించి విస్తృతంగా ప్రచారం కల్పించారు. మహిళా కోటాలో ఈసారి వైసీపీ టికెట్ తనకు వస్తుందని చాలా బలంగా నమ్మారు వాసిరెడ్డి పద్మ. మైలవరం, జగ్గయ్యపేట రెండింటిలో ఏదో ఒక చోట నుంచి తనకు టికెట్ వస్తుందని కూడా ఆశించారు. కానీ సమీకరణాలు, ఇతర కారణాలతో ఆమెకు టికెట్ ఇవ్వలేకపోయారు. దీనిపై కాస్త నొచ్చుకున్నట్టు కూడా తెలుస్తోంది. అయితే తన రాజీనామాకు పార్టీ టికెట్‌కు సంబంధం లేదని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి వైసీపీ ప్రభుత్వం వచ్చేందుకు, జగన్‌ను రెండోసారి సీఎంగా చేసేందుకే రాజీనామా చేసినట్టు వాసిరెడ్డి పద్మ చెబుతున్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనలేమని.. అందుకే ఆ పదవికి రాజీనామా చేస్తున్నట్టు చెబుతున్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజలతో మమేకం కావాలన్నా... ప్రత్యర్థులు చేస్తున్న విమర్శలకు కౌంటర్ ఇవ్వాలన్నా పార్టీ వేదికే అందుకు కరెక్ట్‌గా వాసిరెడ్డి పద్మ భావిస్తున్నారు.

# టిడిపి-జనసేన మరో అడుగు..17న చిలకలూరిపేటలో భారీ సభ



అమరావతి, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల వేడి మరింత తీవ్ర స్థాయికి వెళ్తోంది. ఇప్పటికే అభ్యర్థుల ప్రకటనతో ముందంజలో ఉన్న టీడీపీ జనసేన ఇప్పుడు మేనిఫెస్టోపై ఫోకస్ పెట్టింది. బుధవారం సమావేశమైన టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ చర్చల్లో భాగంగా మేనిఫెస్టోపై కూడా ఓ నిర్ణయానికి వచ్చారు. టీడీపీ, జనసేన కూటమి ఉమ్మడి మేనిఫెస్టో ఈనెల 17న విడుదల చేయాలని నిర్ణయంచారు. ఇరు పార్టీల అధినేతల సూచనలతో సమావేశమైన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ గురువారం ఉదయం సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు. చిలకలూరిపేటలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి అందులో ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేయాలని నిర్ణయించారు. టీడీపీ జనసేన ఉమ్మడిగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన అచ్చెన్నాయుడు...ఐదేళ్లు రాష్ట్ర ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర భవిష్యత్తు కోసమే టీడీపీ - జనసేన పొత్తు పెట్టుకున్నాయని వెల్లడించారు. అభ్యర్థుల ప్రకటన తర్వాత రెండు పార్టీల మధ్య తగాదాలు పెట్టాలని వైసీపీ ప్రయత్నించిందని అవి వర్కౌట్ కాలేదన్నారు. ఈ నెల 17 న చిలకలూరిపేటలో భారీ సభ నిర్వహణకు రెండు పార్టీల నిర్ణయించినట్టు తెలిపారు. ఉమ్మడి మేనిఫెస్టోతో పాటు భవిష్యత్ ప్రణాళికను అదే రోజు వివరిస్తామన్నారు. చరిత్ర సృష్టించేలా 10 లక్షల మందితో చిలకలూరిపేటలో సభ నిర్వహిస్తామని అచ్చన్నాయుడు అన్నారు. అనంతరం మాట్లాడిన నాదెండ్ల మనోహర్... చిలకలూరిపేట సభలో అందరూ భాగస్వామ్యం కావాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. వివిధ స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేసి సభను విజయవంతం చేస్తామన్నారు. సూపర్ 6 నినాదంతో అభివృద్ధి లక్ష్యంతో ముందుకెళ్తున్నా మమని తెలిపారు. పవన్ కళ్యాణ్ భద్రతా సిబ్బంది, జనసేన టీంలను పోలీసులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్షాలను భయపెట్టాలని ప్రయత్నం చేస్తే అది సఫలం కాదన్నారు . టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రయాణం ముమ్మాటికీ రాష్ట్రం.. ప్రజలకోసమే అని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఈనెల 17న ఇరుపార్టీలు చిలకలూరిపేటలో నిర్వహించబోయే ఉమ్మడి బహిరంగసభ నిజంగా చరిత్ర సృష్టిస్తుందన్నారు. టీడీపీ - జనసేన ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలకు జరిగే మేలు ఏమిటో ఆ సభలోనే పవన్ కల్యాణ్ ప్రకటిస్తారన్నారు. జనసైనికులు, వీరమహిళలు ఏ విధంగా సభను విజయవంతం చేయాలో ఆలోచించుకొని, ఎవరికివారు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. ప్రతి గ్రామం నుంచి ప్రజలు స్వచ్ఛందంగా సభకు తరలివచ్చేలా జనసైనికులు పట్టుదలగా పని చేయాలన్నారు.

# హోదా కోసం ఉద్యమిద్దాం.. కదిలిరండి




అమరావతి, పదేళ్ల తర్వాతకూడా ప్రత్యేక హోదా ఊసే లేదు, హోదా అంటే ఏంటో అని వింతగా చూస్తున్నారు, అందుకే ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా కోసం ఉద్యమించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించుకుందని ఏపీ పీసీసీ ఛీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. గత 10 ఏళ్లలో ఏ ఒక్కరూ ప్రత్యేక హోదా కోసం పోరాడింది లేదు. ఉవ్వెత్తున ఉద్యమించకుంటే ప్రత్యేక హోదా రాదు, ఈ బాధ్యతను కాంగ్రెస్ పార్టీ భుజానికి ఎత్తుకుందని వివరించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో కాంగ్రెస్ న్యాయ ప్రతిజ్ఞ సభలో గురువారం షర్మిల మాట్లాడారు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కుఅని.. హోదా విషయంలో మనం 10 ఏళు గొర్రెలయ్యామని అన్నారు. మనల్ని బలి ఇచ్చారని, తొలి 5 ఏళ్లు చంద్రబాబు, జగన్ మరో 5 ఏళ్లు గొర్రెల్ని చేశారని, ఇప్పుడు మనం గొర్రెలం కాదు సింహాలం అన్నారు. సింహాల లెక్కన పోరాటం చేయక పోతే హోదా రాదన్నారు. మంచితనంతో మౌనంగ ఉంటే మనకు హోదా ఇచ్చారా ?.. మంచితనంగా ఉంటే పోలవరం కట్టారా?.. ఆంధ్రులను మోసం చేసిన మోడీ ఒక డి ఫాల్టర్ అని మండిపడ్డారు. మోడీ ఒక కేడీ అని షర్మిల తీవ్ర పదజాలంతో విమర్శించారు.

రాష్ట్ర అభివృద్ధి వారికి పట్టలేదు..

అభివృద్ధిలో ఎక్కడో ఉండే వాళ్ళం.. చంద్రబాబుకి రాష్ట్ర అభివృద్ధి పట్టలేదు. రక్తం పంచుకు పుట్టిన జగన్ అన్నకి అభివృద్ధి ధ్యాస లేదు, మాట ఇచ్చి మడతపెట్టిన ఘనత జగన్ ది అని షర్మిల విమర్శించారు. జలయజ్ఞం కింద వైఎస్ఆర్ కట్టిన ప్రాజెక్ట్ లకి దిక్కులేదు, అని తూర్పారబట్టారు. హోదా రాకపోతే మన బిడ్డలకు ఉద్యోగాలు రావు, మన రాష్ట్రానికి భవిష్యత్ లేనే లేదు, ప్రత్యేక హోదా మనకు ఊపిరి అన్నారు. ఊపిరి లేకుండా బ్రతక గలమా ? రాష్ట్రమంతా కాంగ్రెస్ శ్రేణులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు

బాబు, పవన్, జగన్‌పై షర్మిల బాణాలు

ప్రజలను ప్రత్యేక హోదా నుంచి పక్క దారి పట్టించారు. బీజేపీ కి రాష్ట్రంలో ఒక్క ఎంపీ లేదు, ఒక్క ఎమ్మెల్యే లేదు.. అయినా రాష్ట్రంలో బీజేపీ రాజ్యమేలుతోందని షర్మిల విమర్శించారు. బాబు,జగన్ ఆంధ్ర రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారని మండిపడ్డారు. బాబు అధికారంలో ఉంటే బీజేపీ ఉనట్లే.. జగన్ ఉన్నా బీజేపీ ఉన్నటేనని, 10 ఏళ్లు దాటిన మనకు రాజధాని లేదన్నారు. హైదరాబాద్ 10ఏళ్లు ఇస్తే అవసరం లేదని ఉరుక్కుంటూ వచ్చారు. ఇక్కడ ఒకటి లేదు, మూడు లేదు. ఇది మన రాష్ట్రానికి సిగ్గు చేటని షర్మిల ఆవేశంగా విమర్శించారు.

# వర్షపాతంపై సిఎం రేవంత్ తప్పుడు సమాచారం

హైదరాబాద్,తెలంగాణలో వర్షపాతం నమోదుపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. వర్షపాతంపై ముఖ్యమంత్రివి అబద్దాలని చెప్పారు. భారత వాతావరణ శాఖ లెక్కల ప్రకారం 2023-24 సంవత్సరానికి సాధారణం కంటే 14 శాతం ఎక్కువ వర్షపాతం రాష్ట్రంలో నమోదైందని తెలిపారు. నీటి సమస్యలు తీర్చే సామర్థ్యం లేక.. లోటు వర్షపాతమంటూ మాట్లాడటం విడ్డూరంగా ఉందంటూ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. అబద్దాలు, అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు సత్యదూరమైన మాట్లాడటం పట్ల తెలంగాణ సమాజం అసహ్యించుకుంటున్నదని తెలిపారు. రైతు సమస్యల పరిష్కారంపై రేవంత్ వ్యాఖ్యలు ప్రభుత్వ చేతగాని తనానికి నిదర్శనమని విమర్శించారు.లెక్కల ప్రకారం 2023-24 సంవత్సరానికి సాధారణానికంటే 14శాతం ఎక్కువ వర్షపాతం తెలంగాణలో నమోదు అయ్యింది. నీటి సమస్యలని తీర్చే చేవలేక, చేతకాక .. లోటు వర్షపాతం అని మాట్లాడడం విడ్డూరం అన్నారు. అబద్ధాలు, అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు సత్యదూరపు మాటలు మాట్లాడుతోంది. అధికారంలోకి వచ్చిన తరువాత వారి ప్రవర్తన చూసి తెలంగాణ ప్రజలు అసహ్యించుకొంటున్నారు.ల÷తు సమస్యలు తీర్చడం మాట అటుంచి, తెలంగాణ రైతాంగానికి మూడు నెలల్లోనే స్కాంగ్రెస్ చేతగానితనం పూర్తిగా అర్థమయ్యిందని పేర్కొన్నారు.

# మానవ నాగరికతకు మూలం మహిళ : టీటీడీ ఛైర్మన్



తిరుపతి : మానవ నాగరికతకు మూలం మహిళ అని టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకర రెడ్డి (టీటీడీ ఛైర్మన్ కరుణాకర్ రెడ్డి) పేర్కొన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో తిరుపతి మహతి ఆడిటోరియంలో గురువారం మహిళా దినోత్సవ (మహిళా దినోత్సవం) వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాణాల ప్రకారం ఆదిదేవత మహిళ అన్నారు. చరిత్రలో అనేక మంది రాణులు రాజ్యపాలన సక్రమంగా నిర్వర్తించారని.ఆధునిక కాలంలో సిరిమావో బండారు నాయకే, ఇందిరాగాంధీ(ఇందిరా గాంధీ) , మార్గరెట్ థాచర్ లాంటి మహిళామణులు దేశ ప్రధానులుగా తమదైన ముద్రవేశారని చెప్పారు. భారతీయ సమాజం మొదట్లో మాతృస్వామిక వ్యవస్థగా ఉండేదని, క్రమంగా పితృస్వామిక వ్యవస్థగా మారిందని వివరించారు. వర్తమాన సమాజంలో ఆయా రంగాల్లో ఎంతో ప్రావీణ్యం సంపాదించి ముందుకు వెళుతున్నారని తెలిపారు.పురుషాధిక్య సమాజంలో ఉన్న మహిళలు జ్ఞానానికి మరింత పదును పెట్టాలని, పాఠ్యపుస్తకాలతో పాటు ప్రపంచ జ్ఞానాన్ని అందించే పుస్తకాలను అధ్యయనం చేసినట్లు తెలిపారు. టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి మాట్లాడుతూ హైందవ సనాతన సంస్కృతిలో మహిళలకు విశేషమైన స్థానం ఉందని చెప్పారు. టీటీడీ ఉద్యోగినులు తమ ఇంటిని చక్కబెట్టుకున్న విధంగా, సంస్థ ప్రతిష్టను మరింత పెంచేందుకు కృషి చేశారు.

పద్మావతి అవార్డుల ప్రదానం..

టీటీడీలోని వివిధ విభాగాల్లో విశేష సేవలు అందించారు 20 మంది మహిళా ఉద్యోగులకు టీటీడీ ఛైర్మన్ పద్మావతి అవార్డులు ప్రదానం చేశారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com